సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



రైతుబజార్లలో సీసీ కెమెరాలు

విశాఖ: నగరంలోని 13 రైతుబజార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి చెప్పారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు.




ముగిసిన వర్క్‌షాప్

తగరపువలస: ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో 'బేసిక్ కోర్సు ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది.

న్యూస్‌రీల్

జయజయహే మహిషాసుర మర్దని



మహాచండిగా పూల దండలతో దుర్గాదేవి అమ్మవారి అలంకారం

చోడవరం: శ్రీ మహాచండీ అవతారంలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. చోడవరం శ్రీ దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రంగురంగుల ప్రత్యేక పూల దండలతో శ్రీ మహాచండీ అమ్మవారిగా అలంకరించారు. దుర్గాదేవి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శరణుఘోషతో భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన నూతన ఆర్టీవో



ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్టీవో మనోహర్

దేవరాపల్లి: జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జి.మనోహర్ తారువ క్యాంప్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. మన్యం జిల్లా సాలూరుకు చెందిన మనోహర్ గ్రూప్–1 పరీక్షల్లో అర్హత సాధించి జిల్లా రవాణా అధికారిగా విధుల్లో చేరిన విషయం తెలిసిందే. గురువారం డిప్యూటీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వి..ప్రకాష్ తదితర్లు ఉన్నారు.

ఐఈఆర్‌పీలకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ)లుగా ఎంపికైన వారికి జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ నియామక పత్రాలను గురువారం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 37 పోస్టుల భర్తీకి సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. వివిధ దశల్లో వడపోత అనంతరం మెరిట్‌లో నిలిచిన వారిని ఎంపిక చేశారు. 37 మందిని ఎంపిక చేయగా.. ఇద్దరు ఏజెన్సీ ప్రాంత పోస్టింగ్‌ల్లో చేరేందుకు నిరాకరించారు. దీంతో 35 మందికి జేసీ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.అబ్దుల్ ఆషా పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

రాంబిల్లి: తపాలా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తరాల అనుభూతులపై వ్యాసరచర పోటీలు నిర్వహిస్తున్నట్టు ఐపీవో జి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన దిమిలి తపాలా కార్యాలయంలో మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు ఇతర టెక్నాలజీలో సమాచారం పంపుతుండగా గతంలో ఉత్తరాలు రాయడం, తపాలా ద్వారా బట్వాడా చేయడం అప్పటి అనుభూతులు, ప్రస్తుత పరిస్థితులను ప్రస్తావిస్తూ వ్యాసం రాసి ఈనెల 30వ తేదీలోగా ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు. జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధిస్తే రూ.50 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.25 వేలు బహుమతులు గెలుచుకోవచ్చునన్నారు. ద్వితీయ, తృతీయ స్థాయి నగదు బహుమతులు ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం సమీప తపాలా కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

కల నెరవేరే దిశగా..

జిల్లాలో ప్రధాన రహదారి అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు మరమ్మతు పనులకు సీఎం ఓకే చెప్పారు. వచ్చే నెలాఖరు నుంచి పనులు ప్రారంభం కానున్నాయి. భూ సేకరణ ఇంకా కొలిక్కి రాని దశలో ఎన్నికల ప్రక్రియ మొదలైతే రహదారి సమస్య అలాగే ఉండిపోతుందని భావించిన జిల్లా నేతలు అచ్యుతాపురం పర్యటనకు వచ్చిన సమయంలో ముఖ్యమంత్రికి విషయం వివరించారు. దీంతో సీఎం జగన్ ముందుగా మరమ్మతులు చేయాలని సంబంధిత విభాగానికి సూచించారు.

- తాత్కాలిక ప్రాతిపదికన అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు పనులు
- భూసేకరణ పూర్తయితే గానీ రోడ్డు విస్తరణ పక్కాగా చేపట్టలేని పరిస్థితి
- ఈలోగా మరమ్మతులతో ఇబ్బందులను అధిగమించే ఆలోచన
- జిల్లా నేతల ప్రతిపాదనకు అచ్యుతాపురం పర్యటనలో ఓకే చెప్పిన సీఎం
- సింగిల్‌లైన్ రహదారి మరమ్మతులకు రూ.7.5 కోట్లతో ప్రతిపాదన
- నవంబర్ నెలాఖరు నుంచి రహదారి విస్తరణ పనులు



విస్తరణకు నోచుకోనున్న అచ్యుతాపురం–అనకాపల్లి రహదారి

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం–అనకాపల్లి మార్గం తీవ్ర రద్దీగా మారింది. కనీసం నాలుగు లైన్లు ఉంటే తప్ప సమస్య తీరదు. దీనికి గానూ ప్రభుత్వం రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 243 కోట్ల రూపాయల నిధులు సైతం విడుదలయ్యాయి. రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ విషయంలో రైతులకు, రెవెన్యూ విభాగానికి మధ్య లెక్కలు తేలలేదు. సెజ్‌తో పాటు అభివృద్ధి చెందుతున్న ఈ మార్గంలో భూముల ధరలు పెరిగాయి. ప్రైవేట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని స్థానికులు కోరగా రెవెన్యూ శాఖ సాంకేతిక నిబంధనల మేరకు పరిహారం ఇవ్వగలమని చెబుతోంది. ఈ పంచాయతీ తేలకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఇద్దరు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు సీఎం జగన్‌ను రహదారి సమస్య గురించి ప్రస్తావించి, హుటాహుటిన 7.5 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఆర్అండ్‌బీ శాఖ అంచనాల మేరకు వచ్చే నెలాఖరు నుంచి పనులు మొదలవుతాయి. ముందు రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేసి, భూసేకరణ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాత రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు.

ఎన్నో ఏళ్ల కల

అచ్యుతాపురం–అనకాపల్లి రహదారిని రూ.348 కోట్ల ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో విస్తరించనున్నారు. అందులో రూ. 106 కోట్లు భూసేకరణకు కేటాయించారు. 13.78 కిలోమీటర్ల పొడవులో 1300 ఆస్తులను గుర్తించారు. స్థిరాస్తుల నిర్వాసితులకు అందించే పరిహారం కోసం గ్రామ సభలు నిర్వహించారు. లబ్ధిదారులు సంఘాలుగా ఏర్పడి జాయింట్ కలెక్టర్‌ను కలిసి వారి వినతులను అందజేశారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఇటీవల అవార్డు నోటిఫికేషన్‌కు గడువును పెంచారు. లబ్ధిదారుల నుంచి భూమిని సేకరించి రోడ్డు నిర్మాణదారులకు అప్పగించే పనిలో రెవెన్యూ యంత్రాంగం తలమునకలై ఉంది.

ఆర్డీవో చిన్నికృష్ణ తరచూ లబ్ధిదారులు, రహదారి విస్తరణ పరిధిలో గ్రామస్తులతో చర్యలు జరుపుతూ మార్కెట్ ధర డిమాండ్ చేస్తున్న నిర్వాసితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రూ. 243 కోట్ల లక్షా 92 వేల 159లకు ఖరారైన బిడ్డింగ్ మేరకు అలైన్‌మెంట్‌తో పాటు, రెండు బ్రిడ్జిలు, ఒక ఫ్లై ఓవర్, రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. రోజుకు సగటున వేలాది వాహనాల రాకపోకలు సాగించే ఈ మార్గంలో కనీసం ఆరు లేన్ల రహదారులు ఉంటేనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఉంటుంది.

మత్స్యకారుల అర్థికాభివృద్ధికి బాసట



తారకరామ జలాశయంలో చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు



కోనాం జలాశయంలో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

- తారకరామ, కోనాం జలాశయాల్లో చేప పిల్లల విడుదల

మాడుగుల/మాడుగుల రూరల్: మండలంలో రెండవ అతిపెద్ద జలాశయంగా గుర్తింపు పొందిన తారకరామ రిజర్వాయర్‌లో గురువారం ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ 60 వేల చేపపిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లం గౌరీదేవి, ఎఫ్‌డీవో పి.నాగమణి, సిబ్బంది హేమలత, పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, నీటి సంఘం అధ్యక్షుడు కలిమి గోషమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల అప్పలనాయుడు, అల్లంగి సంజీవరావు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోనాం జలాశయంలో..

అదేవిధంగా చీడికాడ మండలం కోనాం జలాశయంలో ఎంపీపీ కురచా జయమ్మ గురువారం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 1.35 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. వీటిలో రాగండి, బొచ్చె, మోసు, చేప పిల్లలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, జలాశయాలు, చెరువుల్లో చేపల పెంపకానికి ఆర్థికంగా తోడ్పడుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కిమిడి చిన్నమ్మలు, సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కిముడు దేముడు, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, మత్స్యశాఖ అధికారి నాగమణి, స్థానిక మత్స్యకార సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ కాలేజీల నిర్వహణ

ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాలు బేఖాతర్



ఎన్ఏడీ కూడలిలోని ఎన్ఆర్ఐ కాలేజీలో విద్యార్థులు

విశాఖ విద్య: దసరా సెలవుల్లో నగరంలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు యథావిధిగా పని చేశాయి. ఎన్ఏడీ కూడలిలోని ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీలో రికార్డులు రాయాలనే పేరుతో విద్యార్థులను రప్పించారు. కాలేజీలోనే పుస్తకాలు విక్రయించారు. సైన్సు కోర్సులు చదివే విద్యార్థులు సెలవుల్లో ఇళ్ల వద్ద రికార్డులు రాసి తీసుకురావాలని సూచించారు. ముందుగా ఒప్పందం చేసుకున్న ఫీజులో సగం చెల్లించిన వారికే రికార్డు పుస్తకాలు ఇస్తామని చెప్పడంతో.. విద్యార్థులు ఫీజు కౌంటర్ వద్ద బారులుదీరారు. ఎన్ఏడీ కూడలిలోని నారాయణ కళాశాలలోనూ విద్యార్థులు కనిపించారు. గురుద్వార్ సమీపం శాంతిపురంలోని కైట్ కాలేజీలో సీఏ కోర్సుకు తర్ఫీదు పొందే విద్యార్థులకు శిక్షణ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇదే చోట ఉన్న రెజోనోన్స్ స్టడీ సెంటర్(దీనికి అనుమతుల్లేవని అధికారులు చెబుతున్నారు) నుంచి గురువారం విద్యార్థులను ఇళ్లకు పంపించారు. దసరా సెలవుల్లో జూనియర్ కాలేజీలు తెరవవద్దని ముందుగా ఇంటర్ బోర్డు అధికారులు హెచ్చరించారు. స్పెషల్ క్లాసుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేయవద్దని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్పష్టం చేసింది. అయినా కొన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఈ ఆదేశాలను పెడచెవిన పెట్టాయి. దసరా సెలవులైనా కుటుంబ సభ్యులతో గడిపేందుకు అవకాశం లేకుండా పోతుందని ఆయా కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యాల ఒత్తిడితో విధులకు హాజరుకావాల్సి వస్తోందని చెబుతున్నారు. గురువారం పని చేసిన ప్రైవేట్ కళాశాలల వివరాలను సేకరిస్తున్నట్లు ఆర్ఐవో రాయల సత్యనారాయణ వెల్లడించారు.

రూ.2 కోట్లతో కొత్తూరు ఎర్ర చెరువు అభివృద్ధి



కొత్తూరు ఎర్ర చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: పట్టణానికి సమీపంలో కొత్తూరు ఎర్ర చెరువు సుందరీకరణ పనులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం పరిశీలించారు. లారస్ పరిశ్రమ యాజమాన్యం రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఇక్కడ ఎర్ర చెరువును అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పనుల పురోగతిని మంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి చూశారు. ఈ చెరువు చుట్టూ గట్టు పటిష్టపర్చడం, మొక్కలు నాటి, వాకింగ్ ట్రాక్, చుట్టూ ఇనుప ఫెన్సింగ్, కూర్చొనేందుకు బెంచీలు, విద్యుత్ లైట్ల ఏర్పాటు తదితర పనులు ఎంత మేర పూర్తయ్యాయి,ఏఏ దశల్లో ఉన్నాయో మంత్రికి నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. నిర్దిష్ట గడువు విధించుకుని పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, భీశెట్టి జగన్, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, పలువురు అధికారులు, స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముడసర్లోవలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం
IIలో

చేతివృత్తులకు అండగా ప్రభుత్వం



జగనన్న చేదోడు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, కరణం ధర్మశ్రీ



తామరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

- 13,259 మందికి జగనన్న చేదోడు
- రూ.13.25 కోట్ల మేర లబ్ధి

తుమ్మపాల : చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకం ఆర్థిక భరోసాను కల్పిస్తుందని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కర్నూలు జిల్లాలో జగనన్న చేదోడు నాలుగో విడత నగదు పంపిణీ పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి ఆయన వీక్షించారు. వివిధ కులవృత్తులకు చెందిన లబ్ధిదారులకు రూ.13 కోట్ల 25 లక్షల 90 వేలను చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13,259 మంది వివిధ కులాలకు చెందిన వృత్తిదారులను గుర్తించి వారికి ఆర్థిక సహాయంగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. వరుసగా నాలుగో విడత లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులావాణి, బీసీ కార్పొరేషన్ ఏఈవో రమణమ్మ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మాకవరపాలెం : చేదోడు పథకం నగదు జమ సందర్భంగా తామరం సచివాలయంలో గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు చేదోడు పథకం అమలుతో ప్రభుత్వం చేతివృత్తుల వారికి అండగా నిలుస్తుందన్నారు. వైస్ ఎంపీపీ లక్ష్మి, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, ఉప సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నర్సీపట్నంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



సభా ప్రాంగణంలో పార్టీ నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నం ఎన్టీఆర్ మినీస్టేడియంలో శుక్రవారం నిర్వహిస్తున్న నియోజకవర్గ పార్టీ విస్త ృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి హాజరు కానున్నందున పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే గణేష్ వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ బాషా తదితర్లు ఉన్నారు.



లంకలో సీతాదేవికి శ్రీరాముని క్షేమ సమాచారం తెలియజేస్తున్న ఆంజనేయుడు






రామాయణం, భాగవతంలోని ఘట్టాలను చాటిచెప్పేలా తీర్చిదిద్దిన బొమ్మలకొలువు, తిలకిస్తున్న విద్యార్థినులు



రావణ దర్బారులో తోకపై కూర్చున్న హనుమంతుడు

బొమ్మల కొలువు..

రెండు కళ్లు చాలవు



శ్రీకృష్ణుని దివ్య రూపం

యలమంచిలి (అనకాపల్లి రూరల్): దసరా వేడుకలో బొమ్మల కొలువుకు ప్రత్యేక స్థానం ఉంది. శరన్నవరాత్రుల్లో మనదైన సంస్కృతినీ, పురాణాల్నీ, దైనందిన జీవితాన్నీ కళాత్మకంగా పరిచయం చేసే అందమైన వేదిక అది. రామాయణం, భాగవతం, మహాభారతం వంటి పురాణాలు, ఇతిహాసాల్లోని దేవుళ్లు, రాక్షసులు, వాగ్గేయకారులతోపాటు జీవన వేదాన్ని పలికించే ఎన్నో బొమ్మలు కనువిందు చేస్తాయక్కడ.. యలమంచిలిలోని ఉపాధ్యాయ దంపతులు సుసర్ల భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్‌ల ఇంటిలో కొలువు దీరిన బొమ్మలను చూసి తీరాల్సిందే. యలమంచిలిలోని ఓరుగంటివారివీధి మామిడి టవర్స్‌లోని వారి నివాసంలో ప్రతి ఏటా ఈ సంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నారు. దసరాకు 20 రోజుల ముందు నుంచే బొమ్మల కొలువు ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటారు. ఈ ఏడాది వాళ్లింట్లో ఐదు మెట్ల మీద దేవతల బొమ్మల్ని కొలువుదీర్చారు. తొలి పూజలందుకునే గణపతి, జగన్మాత అసుర సంహార సన్నివేశం, రామాయణం, భాగవతంలోని అనేక ప్రధాన ఘట్టాలు, ఘటోత్కచుడి వృత్తాంతం, కుంభకర్ణుడిని నిద్ర లేపే దృశ్యం, ఋషులు, రాధాకృష్ణులు, సూర్యభగవానుడు, లంకలో సీతాదేవికి శ్రీరాముని క్షేమ సమాచారం చేరవేసిన ఆంజనేయుడు, రావణ దర్బారు, తోక మీద కూర్చున్న ఆంజనేయస్వామి, దశావతారాలు, వివిధ దేవతామూర్తులు.. ఇలా ఒకటేమిటి సుమారు 500 బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. దసరాతో పాటు సంక్రాంతికి కూడా వీరు బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు. మట్టి, చెక్కతో చేసిన బొమ్మలనే ప్రదర్శిస్తామని, నేటి తరానికి మన సంప్రదాయం తెలియాలనే ఆశయంతోనే గత పదేళ్లుగా కొలువును తీర్చిదిద్దుతున్నామని భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్ దంపతులు చెప్పారు. చూడడానికొచ్చిన వారికి వాయినాలు, ప్రసాదం ఇస్తామన్నారు.



మహిషాసుర సంహారం వృత్తాంతం తెలియజేసేలా..

క్లుప్తంగా

శారదా పీఠాన్ని సందర్శించిన మంత్రి కారుమూరి



పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠాన్ని రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు గురువారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలను కలుసుకుని ఆశీసులు తీసుకున్నారు. ముందుగా పీఠంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలందుకోవడానికి అర్చామూర్తిని శాస్త్రోక్తంగా ఆలయంలోనికి ప్రవేశింపజేశారు. స్వామీజీల పర్యవేక్షణలో వేదోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీల విజేత దుంగలవానిపాలెం



విజేత జట్టు

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని దుంగలవానిపాలెం జట్టు విజేతగా నిలిచింది. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు జరిగిన ఈ పోటీల్లో 36 జట్లు పాల్గొన్నాయి. వీటిలో దుంగలవానిపాలెం ప్రథమ, వైజాగ్ కోచ్ టీం ద్వితీయ, అగనంపూడి తృతీయ, మధురవాడ జట్టు చతుర్ధ స్థానాలను దక్కించుకున్నాయి. వీరికి ఆదివారం నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకుడు నాయుడు తెలిపారు.

ముడసర్లోవలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం







మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు మృతికి మౌనం పాటిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, సంతాపం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

- 4.37 ఎకరాల్లో నిర్మాణానికి పచ్చజెండా
- పీపీపీ పద్ధతిలో డీ–శాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు
- మొత్తం 75 అంశాలకు ఆమోదముద్ర
- వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్ (విశాఖ): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) నూతన కార్యాలయ నిర్మాణం, పీపీపీ పద్ధతిలో డీ–శాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు, మధురవాడలో రూ.500 కోట్లతో మురుగునీటి శుద్ధి వ్యవస్థ, బయో మైనింగ్, రానున్న మూడు నెలల్లో శ్మశాన వాటికల ఆధునికీకరణ, వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తదితర అంశాలకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వాడీవేడిగా జరిగిన సమావేశంలో మొత్తం 57 సాధారణ అంశాలు, 11 అనుబంధ అంశాలతో పాటు 7 టేబుల్ అజెండాకు ఆమోదముద్ర పడింది. వీధిలైట్ల సమస్యపై సంబంధిత ఏజెన్సీకి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, అవసరమైతే ఒప్పందం రద్దు చేస్తామని కమిషనర్ సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు.

సమావేశం ప్రారంభమైందిలా..

ఉదయం 11 గంటలకు మేయర్ హరి వెంకటకుమారి కౌన్సిల్‌కు వచ్చారు. బెల్ మోగించి కౌన్సిల్ సమావేశం ప్రారంభిస్తూ ముందుగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు మృతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలిపారు. తర్వాత అజెండా అంశాలపై చర్చను మేయర్ ప్రారంభించారు. దీంతో ప్రతిపక్షాలు టీడీఆర్‌పై చర్చ జరగాలని పట్టుబట్టాయి. దీనిపై మేయర్ స్పందిస్తూ జీరో అవర్‌లో మీ సమస్యలు చెప్పుకోవాలని, ముందు అజెండాలోకి వెళ్దామని స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్ష సభ్యులు టీడీఆర్‌పై నిరసన చేపట్టి.. మేయర్ పోడియం చుట్టుముట్టారు. కౌన్సిల్‌కి నిబంధనలు ఉన్నాయని, పోడియంను చుట్టుముట్టే హక్కు లేదని మేయర్ వారిని హెచ్చరించారు. ఆ తర్వాత టీడీఆర్‌లకు సంబంధించి అధికారులు వివరణ ఇచ్చారు.

ఆమోదించిన ప్రధాన అంశాలివే..



- నగర జనాభా, పరిధి, జీవీఎంసీ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే 40, 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముడసర్లోవలోని 4.37 ఎకరాల కార్పొరేషన్ స్థలంలో నూతన ప్రధాన కార్యాలయ నిర్మాణానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. పారిశ్రామిక నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన విస్కో కార్యాలయం కూడా అక్కడే ఏర్పాటు చేయనున్నారు. నూతన కార్యాలయ సముదాయంలో అన్ని సెక్షన్లు, కౌన్సిల్ హాల్, ఇతర సౌకర్యాల కల్పనపై పలుమార్లు విభాగాల అధిపతులతో చర్చించి.. వారి సూచనలు, అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్నారు. కమిషనర్ సూచనల మేరకు కన్సల్టెంట్ సంస్థ రూపొందించిన డిజైన్లను సభ్యులు పరిశీలించారు.
- పారిశ్రామిక నీటి అవసరాల కోసం అప్పికొండ వద్ద పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేసే 100 ఎంఎల్‌డీ డీ–శాలినేషన్ ప్లాంట్ అంశం చర్చకు వచ్చింది. పలువురు సభ్యులు దీనిపై వివరణ కోరగా.. సంబంధిత అధికారి వివరణ ఇచ్చారు. జీవీఎంసీ నుంచి ఒక్క రూపాయి పెట్టేది లేదని, పీపీపీ పద్ధతిలో ప్లాంట్ ఏర్పాటు చేసి.. వారి నుంచి జీవీఎంసీ మంచి నీటిని తీసుకుని పరిశ్రమలకు సరఫరా చేస్తుందన్నారు. దీంతో ప్లాంట్ ఏర్పాటుకు సభ్యులు ఆమోదముద్ర వేశారు.
- శ్మశాన వాటికల ఆధునికీకరణ జరగడం లేదని పలువురు కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మేయర్ స్పందించి జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు వివరణ కోరారు. ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికల అభివృద్ధి, ఆధునికీకరణకు సంబంధించి టెండర్లు పిలిచామన్నారు. అయితే కొన్ని చోట్ల ఎవరూ ముందుకు రాలేదన్నారు. మూడు నెలల్లో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామని కౌన్సిల్‌కు తెలిపారు.
- జోన్–2 పరిధి మధురవాడలో మురుగునీటి శుద్ధి వ్యవస్థ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.500 కోట్ల రుణాన్ని సమీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకునే అంశంపై చర్చ సాగింది. దీనిపై అధికారులు మాట్లాడుతూ రుషికొండ నుంచి కాపులుప్పాడ వరకు 6 పంపు స్టేషన్లు, 50 ఎంఎల్‌డీ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. ఈ వ్యవస్థ ఏర్పాటుతో 6 నుంచి 13వ వార్డు వరకు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.
- జోన్–4 పరిధి 38వ వార్డులో రీడింగ్ రూమ్ నుంచి ప్రభుత్వ విక్టోరియా(ఘోషాస్పత్రి) మీదుగా కంచరవీధి, బీచ్‌రోడ్డుకు రహదారి విస్తరణ అంశంపై జరిగిన చర్చలో కార్పొరేటర్ సాధిక్ మాట్లాడారు. రీడింగ్ రూమ్ నుంచి ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి వరకు రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపారు. అయితే కంచరవీధిలో యాసీన బాబా దర్గా ఉందని.. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.

సాంకేతిక సహాయంతో భూగర్భ జలాల అన్వేషణ



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- వర్క్‌షాపులో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో గూగుల్ ఆధునిక సాంకేతిక సహాయంతో భూగర్భ జలాలను పసిగట్టి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఇండో జర్మన్ ద్వైపాక్షిక ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో వాతావరణ మార్పులు, వర్షాభావం కారణంగా ప్రకృతి సిద్ధమైన జలాలు తగ్గిపోతున్నాయన్నారు. అంతేకాకుండా భూగర్భజలాలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో తాగు, సాగునీరు అందరికీ అందుబాటులో ఉండాలంటే జల వనరుల అన్వేషణ, జలాశయాల నిర్వహణ ఎంతో ఆవశ్యకమన్నారు. కాబట్టి అందుబాటులో జలాలను పొదుపుగా వాడడం, జలరాసులను కనుగొని తగిన విధంగా వినియోగించడం ఎంతో అవసరమన్నారు. దీనికి ఆధునిక సాంకేతిక విజ్ఞానం పట్ల అవగాహన ముఖ్యమన్నారు. ఈ వర్క్‌షాపులో జల నిర్వహణ–జలాల లభ్యతపై తెలియజేసే విషయాలను అవగతం చేసుకుని డ్వామా, ఇంజినీరింగ్ శాఖల వారు ప్రజలకు ముఖ్యంగా రైతులకు ఉపయోగపడేవిధంగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని, వాటి ఏ విధంగా ఉపయోగించుకుంటే బాగుంటుందో అనే విషయంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, భూగర్భజల టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఆర్.లక్ష్మి, టెక్నికల్ అడ్వైజర్ అమర్ సక్సేనా, సీపీవో జి.రామారావు, వాటర్ రిసోర్సెస్ డీఈఈ రాజేంద్రకుమార్, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు, డ్వామా పీడీ సందీప్ పాల్గొన్నారు.

మేకల పెంపకందారుడు హత్య

- చీడిక సమీపంలో ఘటన



చీడిక కొండల సమీపంలో సూరిబాబు మృతదేహం (ఇన్‌సెట్) సూరిబాబు (ఫైల్)

నక్కపల్లి: మండలంలో దోసలపాడు గ్రామానికి చెందిన కొల్లి సూరిబాబు(48) హత్యకు గురయ్యాడు. సూరిబాబు మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ దోసలపాడుకు సమీపంలో చీడిక గిరిజన గ్రామానికి ఆనుకున్న కొండపైకి మేకలను తోలుకెళ్తుంటాడు. యధావిధిగా బుధవారం మేకలను తోలుకుని కొండకు వెళ్లాడు. సాయంత్రం మేకలు ఇంటికి చేరుకోగా అతడు మాత్రం రాలేదు. రాత్రంతా వెతికిన కుటుంబ సభ్యులు గురువారం ఉదయం కొండకు వెళ్లే మార్గంమధ్యలో పడి ఉండటాన్ని గుర్తించారు. అతని తలపై బలమైన గాయాలున్నాయి. హత్యకు గురయినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అప్పన్న, ఎస్‌ఐ శిరీష సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తలపై కత్తితో నరికినట్లు గాయాలున్నాయని పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాపం పసివాడు



బాలుడిని బాలల సదన్‌కు తరలిస్తున్న మమత

విశాఖ విద్య: పెదవాల్తేరు రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి దగ్గర ఓ బాలుడిని ఎవరో చెట్టుకు కట్టేసి వదిలి వెళ్లిపోయారు. మానసిక వికలాంగుడు కావడంతో గంటల తరబడి అక్కడే బాలుడు నరకయాతన అనుభవించాడు. ఈ విషయాన్ని కొంతమంది మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆమె అక్కడికి చేరుకుని బాలుడి దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయారు. మలమూత్ర విసర్జనతో అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆ బాలుడిని అక్కడ నుంచి వేరే చోటకు తీసుకెళ్లి సపర్యలు చేశారు. మూడవ పట్టణ సీఐ కె.రామారావు ఆదేశాలతో కానిస్టేబుల్ శ్యామ్ సుందర్‌తో కలసి చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సదన్‌కు తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు సరిగా పని చేయకపోగా..

మాటలు కూడా రాకపోవడంతో ఆ బాలుడి వివరాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులొచ్చి తీసుకెళ్లే వరకు అతన్ని బాలల సదన్‌లో ఉంచేలా తగిన ఏర్పాట్లు చేశారు.

మాడుగులలో వచ్చే నెల 2న బస్సు యాత్ర



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, బొడ్డేడ ప్రసాద్, పార్టీ నాయకులు



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు తదితరులు

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం
- 'ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే' సమావేశంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రుల సామాజిక బస్సు యాత్ర వచ్చే నెల 2న మాడుగులలో నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎంపీపీ రామధర్మజ అధ్యక్షతన గురువారం సాయంత్రం మాడుగులలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి గురించి ఇంటింటికీ వెళ్లి తెలియజేసి, జగన్ ఎందుకు సీఎం కావాలో వివరించాలని గృహసారథులకు, వలంటీర్లకు సూచించారు. జన్మభూమి కమిటీలు గ్రామాల్లో పథకానికో రేటు పెట్టి చివరకు సొంత పార్టీ వారిని వదలకుండా దోచుకున్న విషయాలు ప్రజల్లో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వద్దాది నుంచి గరికిబంద ప్రధాన రహదారికి రూ.27 కోట్లు మంజూరయ్యాయని, కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల పనులు ఆగాయని, దసరా నుంచి చేపడతామన్నారు. కింతలి ఘాట్‌రోడ్డుకు రూ.9 కోట్లకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో నిధులు మంజూరవుతాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు మంత్రి పదవి వచ్చినా సామాన్య ఎమ్మెల్యేగానే నియోజకవర్గంలోనే ఉంటూ అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటికే గ్రామాల్లో 90 శాతం రోడ్లు పూర్తి చేశారన్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో గెలిచే నియోజకవర్గం మాడుగులని ప్రతిపక్షాలే చెబుతుండటం విశేషమన్నారు.

రాష్ట్రంలో ఒకేసారి 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, మండల సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనువాస్, రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ సంఘ డైరెక్టర్ గొల్లవిల్లి ప్రభావతిసంజీవరావు పాల్గొన్నారు.

ఎస్కలేటర్లు పనిచేయక అవస్థలు



తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్లు సరిగా పనిచేయక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం 8వ నెంబర్, 1వ నెంబర్ ప్లాట్‌ఫాంలపై ఉన్న ఎస్కలేటర్లలో ఒక్కొక్కటి మాత్రమే పనిచేసింది. గోదావరి, రత్నాచల్, జన్మభూమి, కాచిగూడ వంటి ప్రధాన రైళ్లు ఇక్కడ నుంచి బయల్దేరే సమయంలోనే ఎస్కలేటర్లు పనిచేయలేదు. దీంతో ఆయా ప్లాట్‌ఫాంలకు వచ్చే వృద్ధులు, రోగులు మెట్లు ఎక్కలేక నానా అవస్థలు పడ్డారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిత్యం ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్న పాపానపోలేదు.

మహిళ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: ద్వారకానగర్ 3వ లైన్‌లోని సత్య శ్రీదేవి ఎన్‌క్లేవ్‌లో దారుణ హత్యకు గురైన సువ్వాడ సుజాత కేసు దర్యాప్తును ద్వారకా సీఐ సింహాద్రినాయుడు తన బృందంతో ముమ్మరం చేశారు. గురువారం అపార్టుమెంట్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆమె పనిచేస్తున్న టెలీకాలర్ సంస్థ యాజమాన్యంతో చర్చించారు. ఇద్దర మధ్య ఘర్షణ అనంతరం జరిగిన పరిణామాలపై వివరాలు సేకరించారు. లావాదేవీలపై ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అప్పలరాజు (ఫైల్)

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు టోల్‌గేట్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి మరణించాడు. చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన బొల్లం అప్పలరాజు(26) తన మోటారు సైకిల్‌కు గాలి కొట్టించుకుని ఇంటికి వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటుండగా తుని నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతడ్ని అనకాపల్లి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరిణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొట్టడంతో వృద్ధురాలి మృతి



మృతురాలు మంగమ్మ

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలో శెట్టిపాలెం గ్రామానికి చెందిన గొర్లి మంగమ్మ(65) ఇంటికి వెళ్లేందుకు గురువారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: పట్టణంలోని బాలాజీరావుపేట సచివాలయం పరిధి ఎన్టీఆర్ క్రీడామైదానంలో, మండలంలోని గొలగాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, ఎంపీడీవో కె.నరసింహారావు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇంటింటి సమగ్ర సర్వేలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఒక్కో వైద్యశిబిరానికి నలుగురు చొప్పున 8 మంది స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, అవసరమైన మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాలాజీరావుపేట, గొలగాం ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.

ఎంపీ సత్యవతిని కలిసిన ఆర్డీవో మనోహర్



ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీవో

అనకాపల్లిటౌన్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ప్రభుత్వం, ప్రజల మన్ననలు పొందాలని జిల్లా ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన జి.మనోహర్‌కు ఎంపీ బీవీ సత్యవతి సూచించారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ సత్యవతిని ఆర్డీవో మనోహర్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1 సర్వీస్‌కు ఎంపికై, తొలిసారిగా ఈ బాధ్యతలు చేపట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. కష్టపడి చదువుకుంటే ప్రతివ్యక్తి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ) విజయనగరం జోన్ పరిధిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిటీ పిలుపుమేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. రెండు రోజుల కార్యాచరణలో తొలిరోజైన గురువారం స్థానిక గ్యారేజీ డిపో గేటు వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌కి విరుద్ధంగా సీ అండ్ టీ యాక్సిడెంట్ కేసుల్లో చేస్తున్న బదిలీలను తక్షణమే నిలిపేయాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 1,005 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,000	4,380
రెండో రకం	3,860	4,260
మూడోరకం	3,550	3,850

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–14 యూనిట్లు, బీ పాజిటివ్–10 యూనిట్లు, ఓ పాజిటివ్–7 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 482 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 433 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

శ్రీ లలితా.. కరుణాంతరంగితా!

'లకార రూపా లలితా! లక్ష్మీవాణీ నిసేవితా!'.. లక్ష్మీ, సరస్వతుల సేవలందుకునే లలితాదేవిని శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజైన గురువారం వివిధ ఉపచారాలతో భక్తులు పూజించారు. అమ్మవారిని స్తోత్రాలు, సహస్ర నామాలతో స్తుతించారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన రోజుల్లో ఆశ్వీయుజ శుద్ధ పంచమి ఒకటి. ఈ రోజు దుర్గమ్మను లలితా త్రిపురసుందరిగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో కొలిచారు. కొన్నిచోట్ల అమ్మవారిని స్కంద(కుమారస్వామి) మాత, అన్నపూర్ణేశ్వరి, రాజరాజేశ్వరి, కనకదుర్గ అలంకరణలో పూజించారు.

- లలితా త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి
- పలు చోట్ల రాజరాజేశ్వరి, శాకంబరి, ఛండీ, శ్రీమహాలక్ష్మిగా పూజలు



శ్రీ లలితాత్రిపురసుందరిగా సతకంపట్టు కనకదుర్గమ్మ



కనకదుర్గమ్మగా గవరపాలెం గౌరీదేవి



రాజరాజేశ్వరీదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



శాకంబరిగా న్యూకాలనీ అష్టాదశ శక్తిపీఠం దుర్గమ్మ



శ్రీమహాలక్ష్మిగా చిన్నబాబు కాలనీ కనకదుర్గమ్మ



నర్సింగరావుపేటలో పడిపూజలో భవానీ భక్తులు



కశింకోట: మహాచండీ అవతారంలో కనకదుర్గ

అనకాపల్లిటౌన్: పట్టణ, మండలం పరిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దేవాలయాలు, మండపాలు భక్తుల దేవీ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు చేశారు.

నూకాంబిక బాలాలయంలో విశేష పూజలు

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతిపూజ, కుంకుమపూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి నవకలశ స్నపనం, శ్రీచక్ర మేరువుకు పంచామృతాభిషేకాన్ని ఆలయ ధర్మకర్త పాము అనురాధ సన్నిబాబు దంపతులు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ధర్మకర్తలు, మహిళలు ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

లలితా త్రిపురసుందరిగా సతకంపట్టు కనకదుర్గ

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మను లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో అమ్మవారికి కంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ మాలా ధారణ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు బంగారుహారం బహూకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సతకంపట్టు కనకదుర్గమ్మకి ఆలయ చైర్మన్, బెల్లం వర్తకులు కర్రి సన్యాసినాయుడు దంపతులు బంగారు హారాన్ని తయారు చేయించారు. దీన్ని ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. కమిటీ సభ్యులు చైర్మన్ సన్యాసినాయుడు దంపతులను సత్కరించారు.

కనకదుర్గమ్మగా గౌరీపంచాయతన అమ్మవారు

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి కనకదుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మహిళలచే సామూహిక సహస్త్ర పసుపు కొమ్ముల పూజ(హరిద్ర శృంగార్చన) చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి అలంకరణలో కామాక్షిదేవి

నిదానందొడ్డి కామాక్షమ్మ ఆలయంలో కామాక్షిదేవి అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడి పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కన్యక పూజలు నిర్వహించారు. శ్రీ రాఘవేంద్రస్వామి బృందావన సమితి సభ్యులు వండర్ కిడ్స్ వారిచే వేద పారాయణ జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సత్యవతి

గవరపాలెం పార్క్ సెంటర్లో శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మను ఎంపీ బీవీ సత్యవతి గురువారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ సభ్యులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ చేతుల మీదుగా 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ దంపతులకు వాయనాలు అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పీలా రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కాండ్రేగుల అప్పలనాయుడు, వాయనాల దాత ద్వారపూడి మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట వద్ద జాతీయ రహదారి పక్కన వేంచేసిన కనకదుర్గమ్మ గురువారం మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారిని మహాచండీగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. పరిసర గ్రామాల భవానీ భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు.



నూకాంబిక బాలాలయంలో శ్రీ చక్ర మేరువుకు పంచామృతాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు



సతకంపట్టు కనకదుర్గకు బంగారు హారాన్ని సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ సన్యాసినాయుడు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్యక పూజలో భక్తులు



గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో సహస్ర పసుపు కొమ్ముల పూజలో భక్తులు



గవరపాలెం మండపంలో కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ సత్యవతి



వేల్పులవీధి గౌరీపరమేశ్వర ఆలయంలో సుందరకాండ పారాయణం చేస్తున్న మహిళలు



నూకాంబిక బాలాలయంలో హోమం చేస్తున్న ఆలయ ధర్మకర్తలు, అర్చకులు

ఘనంగా మరిడిమాంబ పుట్టుక మహోత్సవం

కశింకోట: కశింకోటలో గురువారం సాయంత్రం మరిడిమాంబ పుట్టుక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గవరపేటలోని కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి ప్రాంతాల్లో వేర్వేరుగా ఉన్న అమ్మవారి ఆలయాల నుంచి పల్లకీలను ఇక్కడి పుట్ట వద్దకు తీసుకెళ్లి పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో నిలిపి గ్రామంలో ఊరేగించారు. కస్పావీధి పల్లకిని రిక్షాపై ఊరేగించగా, గవరపేట కనకమహాలక్ష్మి వీధి పల్లకిని భక్తులు మోస్తూ, డప్పులతో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పుట్టుక ఉత్సవం జరిపారు.



రిక్షాలో ఊరేగిస్తున్న మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు

సెలవుల్లో తరగతులపై చర్యలు తీసుకోవాలని వినతి

తుమ్మపాల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. కలెక్టరేట్ గేటు వద్ద గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు ధర్నా చేసి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, పనిష్మెంట్ పేరిట అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పబ్లిక్ సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహించి, పిల్లను ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్ఐవో, డీఈవోలకు నివేదించినా, పట్టించుకోలేదని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి ఎస్.నాగరమణ, ప్రెసిడెంట్ ఎం.రమణ, ట్రెజరర్ గొర్లి తరుణ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివాజీ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆర్థిక భరోసా

అనకాపల్లిటౌన్: మహిళా రైతులు ఎన్నో పోషకాలు కలిగిన చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసే చిన్న పరిశ్రమలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకుని, ఆర్థిక భరోసా పొందాల్సిందిగా ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. స్థానిక సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో చెరకు, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చిరుధాన్యాలతో రూపొందించే ఆహారపదార్థాలపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ మహిళా రైతులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగపరచుకోవాలని కోరారు. జాగృతి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ ఇవ్వటంపై ఆనందం వ్యక్తం చేశారు. మరో శాస్త్రవేత్త పి.శ్రీదేవి మాట్లాడుతూ బెల్లం చాక్లెట్లు, చెరకు రసంతో జెల్లీలు, బెల్లం బిస్కెట్లు తయారుచేసే విధానాన్ని వివరించారు.

అలాంటి తండ్రులున్న ఇల్లు 'ఇంద్రప్రస్థం'

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథరావు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న కర్రి రమేష్ స్మారక ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవ ఐదో రోజు పోటీలను రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు రమణమూర్తి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. సతకంపట్టు శ్రీ కనకదుర్గమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న నాటికోత్సవాల్లో గుంటూరు అభినయ్ వారి సాంఘిక నాటిక ఇంద్రప్రస్థంను ప్రదర్శించారు. ప్రేమ పేరిట అనాలోచిత నిర్ణయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్న నీతిని నాటిక ద్వారా వివరించారు. ఓ తండ్రి తన కొడుకు ప్రేమ విషయాన్ని తెలుసుకుని, అమ్మాయి తండ్రి గురించి ఆలోచించడం, ప్రేమికుల తప్పుల్ని సరిదిద్దుతూ, కొన్ని షరతులతో వారిలో క్రమశిక్షణను పెంచడం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అలాంటి తండ్రి ఉన్న ప్రతి ఇల్లూ ఇంద్రప్రస్థమేనంటూ ముగింపు పలికారు. శ్రీస్నిగ్ధ రచనకు ఎస్.రవీంద్రరెడ్డి(తండ్రి పాత్రధారి) దర్శకత్వం వహించారు.



ఇంద్రప్రస్థం నాటికలో ఓ ఘట్టం

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు మండలంలోని 27 పంచాయతీల పరిధిలో నిర్వహించిన ఉపాధి పనులపై గ్రామ స్థాయిలో ఈ నెల 6 నుంచి సామాజిక తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇపుడు మండల స్థాయిలో ఉపాధి పనులపై ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నివేదికలను సభకు నివేదిస్తామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు శ్రీరామరక్ష



గొల్లవీధి యూపీహెచ్‌సీలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



కొత్తూరు వైద్యశిబిరంలో రోగుల వివరాలను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గొల్లవీధిలో బీపీ పరీక్షించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్



తాళ్లపాలెం శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- ఆరోగ్య శిబిరాలను పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు విశేష స్పందన

అనకాపల్లిటౌన్: స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకూ ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున వైద్యశిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని 83వ వార్డు పరిధి గొల్లవీధి యూపీహెచ్‌సీ, మండలంలోని కొత్తూరులో నిర్వహించిన వైద్యశిబిరాలను గురువారం ఆయన ప్రారంభించారు. వైద్య సేవల కోసం పేర్లు నమోదు చేసుకున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ కౌంటర్లను పరిశీలించారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి, ఆహార పదార్థాలను మంత్రి రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సీఎం జగన్ సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఎంతో మంది రోగులకు స్వస్థత చేకూర్చుతున్నారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాలను పట్టణ, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం కోసం ఎంత ఖర్చయినా, ప్రభుత్వమే భరించి, ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. అనంతరం మంత్రి గొల్లవీధి యూపీహెచ్‌సీలో బీపీ చెక్ చేసుకున్నారు.

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, జెడ్పీ సుర వెంకటరమణ, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, సకలా గోవింద్, పార్టీ మండల కార్యదర్శి భీశెట్టి జగన్, నియోజకవర్గ సీడీపీవో కె.ప్రభావతి, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య శ్రీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కశింకోట: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తాళ్లపాలెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి సందర్శించి వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఉన్నత వైద్యానికి సిఫార్స్ చేస్తామన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యులు అందిస్తున్న ఆరోగ్య సేవలను, కంటి పరీక్షలు, స్పాట్ రిజిస్ట్రేషన్, మందుల పంపిణీ విభాగాలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. శిబిరంలో 438 మందికి వైద్య సేవలందించారు. 92 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 9 మందిని కేటరాక్టు ఆపరేషన్లు, 56 మందికి కళ్లద్దాలు ఇవ్వడానికి సిఫార్సు చేశారు. 14 మందికి ఆరోగ్య శ్రీలో ఉన్నత వైద్యం అందించాలని నిర్ణయించారు. వైద్య నిపుణులు గ్రేసీ కేథరిన్, సహజ, ఎ.మణీషా, వాణి రోగుల్ని పరీక్షించి, అవసరమైన మందులు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ఎల్ఈడీ టీవీ ద్వారా ప్రదర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ కార్యదర్శి దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి గణేష్, అద్దంకి సతీష్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, చిన్ని రాజీవ్, గుమ్మడి నారాయణరావు పాల్గొన్నారు.



తాళ్లపాలెం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం అందిస్తున్న డాక్టర్లు



కంటి వైద్య శిబిరంలో బాలునికి కంటి చూపు పరీక్ష నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి



శిబిరంలో స్పాట్ ఓపీ నమోదు చేసి, రోగుల బీపీని చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యుత్ స్తంభాల మార్పునకు చర్యలు



గాంధీనగరంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు తీస్తున్న గోతుల్ని పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ పరిధిలో రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీ1 సెక్షన్ ఏఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గాంధీనగరంలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు తవ్వుతున్న గోతుల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూచౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకూ కొత్తగా 40 విద్యుత్ స్తంభాలు, పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు 60 స్తంభాలను మార్చనున్నట్లు తెలిపారు. పెరుగుబజార్ రహదారికి ఇరువైపులా వేలాడుతున్న విద్యుత్ వైర్లను కూడా సరిచేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి సహకరించాల్సిందిగా కోరారు.